# పెంపకం

వెంకటేశ్వర్లు చిన్నప్పుడెప్పుడూ తల్లి మాట జవదాటలేదు. వాడు పెద్దయ్యాక పెళ్లాం గీచిన గీటు దాటలేదు. ఇల్లా జరుగుతుందని తాసిల్దారుగారు, అంటే వెంకటేశ్వర్లు తండ్రి ఊహించి చెప్పాడు "ఏమేవ్! నీ మాట వింటున్నాడని ఇప్పుడు సంబరపడగానే సరి గాదు. ఇల్లా మాట వినడం అలవాటైతే పెద్దయ్యాక పెళ్లాం మాట వింటాడు. అప్పుడు వాడినని లాభముండదు" అని భ్రమరాంబగారిని మందలిస్తూ ఉండే వాడు. వాళ్లది మాపక్కిల్లు. అందుకని వాళ్లింట్లో సంగతులు మాకు తెలుస్తూనే ఉండేవి.

అలాతే తాసిల్దారు గారెప్పుడూ ఊళ్లో ఉండేవారు కాదు. కాంపుమీద పోతే కొన్ని రోజులకి, ట్రాన్స్ఫర్ మీద పోతే కొన్ని నెలలకి తిరిగి మాఊరువచ్చే వారు అందుకని ఆయన కుటుంబం మాత్రం ఆయన్తో తిరగకుండా స్థిరంగా మా పక్కింట్లో ఉండేది. అది వాళ్ల స్వంతిల్లు. ఇంతకు చెప్పొచ్చేదేమిటంటే వెంకటేశ్వర్ల పెంపకం బాధ్యత పూర్తిగా భ్రమరాంబగారు స్వీకరించారు. మామూలుగా పెద్దవాళ్లు తాము పెరిగిన పద్ధతి చాలా అద్భుతమైనదని దానివల్లే తమంత గొప్పగా తయారయ్యామని నమ్మి, తమ పిల్లల్నా పద్ధతిలో పెంచాలని చూస్తారు. ప్రతితల్లీ అదే పొరపాటు చేస్తుంది. తను పెరిగిన పద్ధతి ఎంత అద్భుతమైనదైనా అది ఆడపిల్లలు పెరిగిన పద్ధతిని గుర్తించక, కొడుకుల్ని ఆ పద్ధతిలో పెంచాలని చూస్తారు. భ్రమరాంబగారి పెంపకంలో పెరిగిన వరలక్ష్మి, భ్రమరాంబగారికి మంచి కూతురు, నాకు మంచి భార్యా, మా అమ్మకి మంచి కోడలు. కాని వెంకటేశ్వర్లు మంచి కొడుకుగా ఉన్నవాడు. మంచి మొగుడుగా మారి పోయాడు.

వెంకటేశ్వర్లు చిన్నప్పుడు బట్టలు మాసిపోయే ఆటలు ఆడేవాడు కాదు. వర్డ్స్‌బిల్డింగో, కారమ్సో ఆడేవాడు. మేమంతా కఱ్ఱాబిళ్లా, చెడుగుడు, నుంచుంటే తాపు అడుతూ ఉంటే, పుస్తకాలు ముందేసుకుని, కూర్చునేవాడు. అందుకని క్లాసులో వాడికి మంచి మార్కులు వచ్చేవి. మా వీధిలోని పిన్నులకి, దొడ్డమ్మలకి, అత్తయ్యలకి, వెంకటేశ్వర్లు

కె. వి. యస్. శర్మ




బాగా చదువుకుంటాడని, మాలా బట్టలు తోళ్లలా మాపుకోడని, వాడంటే అభిమానం. మమ్మల్ని "వెంకటేశ్వర్లుని చూసైనా నేర్చుకోండి" అంటూ కేకలు వేసేవారు.

కట్టా బిళ్లా ఆడితే కళ్లుపోతాయని, చెడుగుడు అవి అలగా వెధవలు ఆడే ఆటలని, భ్రమరాంబగారు వాడికి నూరిపోసింది. అందుకని వాడు చిన్నప్పటి నుంచి అడ్డమైన 'నర్సన్న బుర్సన్న' లతో ఆడటానికిష్టపడేవాడు కాదు. అందుకని వాడికి నేను తప్ప స్నేహితుల్లేరు. నేనూ వెంకటేశ్వర్లు ఒకటే క్లాసు అవటంచేత స్కూలుకిద్దరం కల్సి వెళ్తుండేవాళ్ళం. ఇంటికి వచ్చాక వాడి ప్రపంచం వేరు, నా ప్రపంచం వేరు.

వాడు, వాడి చెల్లెలు వరలక్ష్మితోను, ఆ పిల్ల క్లాసుమేటు అలిమేలుతోను ఆడే వాడు. అలిమేలు, ఎప్పుడూ మల్లెపువ్వులా ఉండే వెంకటేశ్వర్లంటే చాలా ఆరాధన కనపరిచేది. వాడు వయస్సుతో ఎల్లా మారుతూ వచ్చింది నాకు బాగా తెలుసు. భ్రమరాంబగారన్నట్లు, పెళ్లవగానే వాడు హఠాత్తుగా మారలేదు.

ఒకరోజు నేనూ వెంకటేశ్వర్లు స్కూలునుంచి వచ్చి వాళ్ల గుమ్మం ముందు నిలబడి ఆ రోజు స్కూల్లో ఇచ్చిన హోంవర్కు గురించి మాట్లాడు కుంటున్నాం. అప్పుడు వరలక్ష్మి వచ్చి "అన్నయ్యా! మా కందటంలేదు. కొంచెం చెట్టెక్కి జామకాయలు కోసిపెట్టరా" అని అడిగింది. వెంకటేశ్వర్లు మాటల్లో అప్పు డప్పుడు అలిమేలు ఉంటూ ఉండటంచేత, వరలక్ష్మి అల్లా అడిగినప్పుడక్కడ అలి మేలుండటంచేత వాడు కోసిపెడ్తాడను కున్నాను. చెట్టెక్కుతాడని అనుకోలేదు కాని కఱ్ఱపెట్టి కొడ్తాడని అనుకున్నాను.

కాని వాడు "చెట్టెక్కి కోయటానికి నేనేం కోతినా!" అని వరలక్ష్మిని విసు క్కున్నాడు. వరలక్ష్మి ఏడుపుమొహం పెట్టింది. ఆ అమ్మాయి, పెద్ద కళ్ల నీళ్లతో నిండటం చూసి భరించలేక—

"నేను కోసిపెట్టనా?" అని అడి గాను. వరలక్ష్మి ఆనందంగా తలూ పింది. అంతే చెట్టెక్కి జామకాయలు కోసి వరలక్ష్మికి, అలిమేలుకి ఇచ్చాను, వరలక్ష్మికి, చెట్టెక్కగలిగిన నేను ఒక హీరోలా కనిపించి ఉంటాను. నాకేసి గొప్ప అరాధనతో చూసింది. ఆ చూపు తోనే నన్ను కట్టిపడేసుకుంది. అయితే అలిమేలుకి మాత్రం, ముష్టిజామకాయల కోసం వరలక్ష్మి అంత వెంపరలాడటం వాటికోసం నేను బట్టలు మాపుకుంటూ, చెట్టెక్కడం నచ్చలేదు. నేను చెట్టెక్కి జామకాయలు కోసేలోపల వెంకటేశ్వర్లు లోపలికివెళ్ళి మొహం కడుక్కుని బట్టలు మార్చుకుని వచ్చాడు. అలిమేలు మొహం ఒక్కసారి వెలిగింది. ఆడపిల్లల్లో ఒకొక్కళ్లకి ఒకోటి నచ్చుతుంది, ఒకోడు నచ్చుతాడు. మనలో కూడా అందరికీ ఒకలాంటి ఆడపిల్లే నచ్చదు కదా! ఇంతకు నే చెప్పొచ్చింది వెంకటే శ్వర్ల కెంతసేపు తన బట్టలూ, తన చదువే కాని, చెల్లెలు గొడవ పట్టలేదు.

స్కూలుఫైనల్ పరీక్షల ముందర ప్రిపరేషన్ హాలిడేస్‌లో సాయంత్రాలు ఆడటం మానేసి బీచ్‌కేసి షికారుకు వెళ్లటం అలవాటు చేసుకున్నాను. ఒక రోజున వెంకటేశ్వర్లు ఏ కళనున్నాడో నాతో బీచికి వచ్చాడు. నేను కెరటాల్లో కాళ్ళు కడుక్కుంటుంటే, వెంకటేశ్వర్లకి కూడా కెరటాలతో ఆడుకోవాలనిపించి నీళ్లల్లోకి వచ్చాడు. అయితే అల్లాంట ప్పుడు, సాధారణంగా ఆడపిల్లలు చేసే టంత హడావిడి చేశాడు వెంకటేశ్వర్లు. పరిగెత్తటం, గంతులు వేయటం చేసాడు.

ఇల్లాంటప్పుడు సాధారణంగా జరిగేపనే జరిగింది. ఒక బలమైన కెరటం వెంక టేశ్వర్లను తోసేసింది. మామూలుగా అయితే నిలదొక్కుకోగలుగును. కాని కేవలం వాడు చేసిన హడావిడి మూలంగా నీళ్లల్లో పడ్డాడు. బట్టలు తడిసిపో యాయి. మేము ఇళ్లకు వెళ్లేసరికి వాడి వంటినున్న బట్టలు ఆరలేదు. వాళ్లమ్మ గారు వాడిని ఏం కేకలు వేశారో అని ఆలోచిస్తూ రాత్రంతా నిద్రపోలేదు. మర్నాడు సాయంత్రం వాళ్లింటికి వెళ్లాను. వెంకటేశ్వర్లు జలుబుతో బాధ పడ్తు న్నాడు. ఇంతలో భ్రమరాంబ గారెక్కడి నుంచో వచ్చి

"చూడుశర్మా! నువ్వెళ్తే వెళ్ళు. కాని మావాడిని మాత్రం ఆ సముద్రస్నానా లకి తీసుకువెళ్లకు అక్కడ స్నానాలకని వెళ్లి ఎంతమంది చచ్చిపోయారో! అదృష్టంకొద్దీ ప్రాణాలతో బయట పడ్డాడు" అంటూ నన్ను కేకలు వేస్తూ మాట్లాడింది. వెంకటేశ్వర్లు నోరెత్తలేదు. నాకర్థం అయింది. వాడీ నెపం నామీదకు తోసేసి ఉంటాడు. ఆక్షణంలో పిరికి వాడని జాలిపడి ఊరుకున్నాను. ఇప్పు డనిపిస్తుంది వాడు స్వార్థపరుడని. తను ఇబ్బందిలోంచి బయటపడటానికి వాడే మైనా చేస్తాడు. కొందరిళ్లల్లో వాళ్లకి జరిగిన ప్రతిచెడుకి బయటివాళ్లెవరో బాధ్యులన్నట్లు మాట్లాడటం అలవాటుం టుంది. నిజానికి నాయీడు వాడైన వెంకటేశ్వర్లను నేను తీసుకు వెళ్లటం ఏమిటి? భాగ్యమ్మగారు ''ఒరేయ్! వెంక టేశ్వర్లూ నువ్వింక అటుకేసి వెళ్ళకు". అని భయపెట్టటంలో అర్థం ఉంది. కాని నన్ను వాడిని తీసుకు వెళ్ళద్దని అనటంలో అర్థం కనిపించలేదు, ఆపైన ఆవిడ లోపలికి వెళ్ళి నాకు వినపడేలా "ఆశర్మకి బుద్ధి లేకపోతే నీకేమైంది!" అంటూ కేకలు వేసింది. అందుకని ఆ యింటితో రాకపోకలు తగ్గించాను. పూర్తిగా నిలిపి వేయకపోవడానికి వరలక్ష్మి కారణం.

సరిగ్గా ఇంటర్మీడియట్ పరీక్షల ముందోసారి భ్రమరాంబ గారింట్లో అది వారప్పూట బంట్రోతులింట్లోలేని సమ యంలో ఒక పొగరుమోతుగొడ్డు పడి పెరడంతా పాడుచెయ్యటం మొదలు పెట్టింది. ఆవిడ వీధిలోకివచ్చి, వీధి మొగలో ఉన్నరిక్షా వాడిని పిలిచింది. అతను ఆశతో వచ్చాడు.

"మాపెరట్లో గొడ్డు పడింది నాయినా. కొంచెం తోలిపెట్టు" అంటూ ఆవిడ అతన్ని బతిమాలింది.

"మంచోరే. బేరమనుకొని పారొచ్చి నాను. అణాడబ్బులు సంపాదించుకునే టయములో ఇట్టాటి పనులెక్కడ సేస్తాం" అంటూ వెళ్ళిపోయాడు.

ఇంతలో వరలక్ష్మివచ్చి "అన్నయ్యని తోలమనరాదే!" అంది.

"అల్లాంటి పనులు వాడికేం చేత

నౌతాయి. అసలే అది పోట్లమారిదిలా ఉంది, అదిగాని కొమ్ము విసురే ఏమన్నా ఉందా! అసలే వాడికి పరీక్షలు వారంలో ఉన్నాయి" అని భాగ్యమ్మ గారు అనటం నాకు వినపడింది. వీధిలో పచార్లుచేస్తూ చదువుకోటం నాకలవాటు. ఆవిడ ఇదంతా నేను వినటం లేదనుకుని భ్రమపడినట్టుంది. "నాయనా శర్మా! పెరట్లో గొడ్డు పడింది. తోలి పెట్టుబాబు!" అని ఆప్యాయంగా పిల్చింది,

"మీవెంకటేశ్వర్లేమయ్యాడువదినా?" మాఅమ్మ అడగనే అడిగింది మా ఇంటి కిటికీలోనుంచి.

"ఇంట్లోలేడు. ఉంటే ఈబాధ ఎందుకు!" అంది ఆవిడ. వరలక్ష్మి అశ్చర్యపోయింది.

నేనేం చెప్తానో అని వరలక్ష్మి నిలబడి చూస్తోంది. నేనప్పుడు సాహసం చేయకపోతే వరలక్ష్మి దృష్టిలో నేను వెంకటేశ్వర్లతో సమానం,అయిపోతాను, అందుకని ఇంట్లోకి వెళ్ళి మాతాతగారి దుడ్డుకఱ్ఱను తీసుకుని, వాళ్ళ పెరట్లో పడ్డాను, చాలా హైరానా పడి ఆ గొడ్డును బయటికి తరమ గలిగినాను. నా వంటిమీద అక్కడక్కడ మొక్కలు అవీ గీసుకున్నాయి. అయినా వరలక్ష్మి సినిమాలో హీరోకేసి హీరోయిన్ చూసే చూపులాంటి చూపు చూడ్డంతో నా శ్రమకి ప్రతిఫలం ముట్టింది. మొగపిల్లలు ఎప్పుడోప్పుడు, ఏదో ఒకవయస్సులో తల్లి రక్షణనుంచి బయటపడి మొగ కొడుకుగా బాధ్యతలు స్వీకరించి నేర్చుకోవాలని నా అభిప్రాయం. ఈ బాధ్యతలు స్వీకరించటంలో ఇబ్బందులున్నాయి. బెడిసి కొడితే వచ్చే ఫలితాన్ని, చెడ్డపేరుని భరించాల్సి వస్తుంది. అమ్మ నాన్నా చెప్పే మాటలు సర్వకాలాల్లోను వినేవారు సాధారణంగా బాధ్యతా విముఖులు. వీళ్ళకి కూడా రాముడిలాంటి వాళ్లతోపాటు బుద్ధిమంతులన్న బిరుదు ప్రపంచం ఇస్తుంది. వీళ్ళు మామూలుగా...నన్ను మెడిసిన్‌లో పడేసారు...నాకీ దిక్కుమాలిన సంబంధం చేసారు...శర్మ నన్ను బీచ్‌కి తీసుకువెళ్లాడు...అంటూ వికటించిన ప్రతి పనికి మరొకళ్ళు బాధ్యులని నెపం నెట్టేస్తారు. వెంకటేశ్వర్లు బుద్ధిమంతుడు.

అలిమేలు వెంకటేశ్వర్లలో ఏమిచూసి వాడి చుట్టూ అంతలా తిరుగుతోందా అనుకునేవాణ్ణి. బహుశః నాయకురాలి లాంటి ఆడపిల్లల్ని వాళ్లమీద ఆధారపడి వాళ్లు చెప్పినట్టువినే మగరాయుళ్ళు ఆకర్షిస్తారనుకుంటాను. వెంకటేశ్వర్లలోని 'వినే' గుణం అలిమేలును ఆకర్షించి ఉంటుంది. అలిమేలు తనస్వార్థమే చూసుకునే పిల్లకాదు. కాని తనమాటే నెగ్గాలి అనుకునే రకం. వరలక్ష్మి పెరట్లో కబుర్లు చెప్పుకుందాం అని ఉండి అలిమేలు వీధివైపు కారమ్స్ ఆడుకుందాం




అని ఉంటే, వాళ్లిద్దరు ఆ రోజు వీధివైపు కారమ్స్ ఆడుకునేవారు. వరలక్ష్మిలో ఉన్న ఈ సర్దుకుపోయేగుణమే నన్నెక్కువగా ఆకర్షించింది.

ఇంటర్మీడియేటు అయ్యాక వెంకటేశ్వర్లు మెడిసిన్‌లో జేరాడు. నేను ఇంజినీరింగులో చేరాను. వాడు మెడిసిన్‌లో జేరాక భ్రమరాంబగారు చేసే ఆర్భాటం పెరిగిపోయింది. అదెంతవరకు వచ్చిందంటే, ఒకసారి ఆవిడ వాళ్ళింట్లో కరెంటుపోతే "శర్మా! మా యింట్లో దీపాలు పోయాయి. కాస్త ఎలక్ట్రిసిటీ వాళ్ళతో చెప్పు నాయనా! వెంకటేశ్వర్లను వెళ్ళమందామా అంటే వాడిప్పుడే కాలేజీనుంచి ఇంతలావు పుస్తకాలు మోసుకుంటూ, అలిసిపోయి వచ్చి పక్కమీద నడుంవాల్చాడు." అని నాకు పని పురమాయించేదాకా వచ్చింది. దానికోసం ఎలక్ట్రిసిటీ వాళ్ళు రానక్కరలేదని నేనే ఫ్యూజు వేసాను. నేను ఫ్యూజువేస్తుంటే టార్చిపట్టుకున్న వరలక్ష్మి "అయ్యబాబోయి! ఇవన్నీ నీకు చేతానా!" అన్నట్టు ఆశ్చర్యంగా చూస్తే నాకు అందలం ఎక్కినట్లైంది. వరలక్ష్మి ప్రతి దాంట్లోను వాళ్ల అన్నయ్యను, నన్ను పోల్చి చూసుకుని, నేను చాలా గొప్పవాడిననే నిర్ణయానికి వచ్చేది. ఆ విషయం నాకాచూపుల్లోనే తెలిసేది. వరలక్ష్మి టార్చిలైటు ఆర్పిన తరువాత, నేను మెయిన్ వెయ్యబోయి ఆగి, ఆ పిల్లను దగ్గరకు తీసుకుని మొండి ధైర్యంతో ముద్దుపెట్టుకున్నాను. లైట్లు వేశాక, ఆ రోజుకి సిగ్గుతో వరలక్ష్మి పారిపోయినా, ఆ తరువాతెప్పుడు ఫ్యూజు

పోయినా నాకు కబురుచెప్పి, తను టార్చి లైటు పట్టుకునేది!

నేను బి. యి. పూర్తిచేసుకుని ఎమ్.ఇ చదవటానికి బెంగుళూరువెళ్లాను. అక్కడనుంచి ధైర్యంచేసి వరలక్ష్మికి ప్రేమలేఖలు వ్రాయటం మొదలు పెట్టాను. వరలక్ష్మి వాటికి పెద్ద బఠాని గింజల్లాంటి అక్షరాలతో జవాబిచ్చేది. నేను ఉత్తరాలు శనివారం మధ్యాహ్నం వ్రాయటం మొదలుపెట్టి సోమవారం పొద్దున్నకి పూర్తిచేసి పోస్టు చేసేవాడిని. వరలక్ష్మి వ్రాసేఉత్తరాల్లో అప్పుడప్పుడు అలిమేలు ప్రసక్తి ఉండేది. వాళ్ళన్న య్యంటే, ఆ పిల్లకు చాలా ఇష్టమని, వెంకటేశ్వర్లు కూడా అలిమేలుతో కబుర్లు చెప్పడానికి, ఉత్సాహం చూపిస్తాడని వాళ్లిద్దరికి పెళ్ళయితే బావుండునని వ్రాసేది. అయితే ఆ ప్లీడరుగుమస్తా కూతురిని, భ్రమరాంబగారు వాళ్ల అబ్బా యికి చేసుకుంటుందన్న నమ్మకం నాకు లేకపోయింది.

మొదటి ఏడు పూర్తయి సెలవలి కింటికి వెళ్లాను. రోజూ వరలక్ష్మిని కలుసుకునేవాడిని. అల్లాంటి రోజుల్లో ఒకరోజున భ్రమరాంబగారు మా యింటికి వచ్చింది, వాళ్ల వరలక్ష్మిని నాకివ్వాలని వాళ్ళకుందని, పెళ్లి ఘనంగా చేస్తామని లాంఛనాలకి మూడువేల దాకా ఇస్తామని అంది. ఆవిడ కట్నంసంగతి ఎత్తలేదు. మా అమ్మ జవాబు చెప్పలేదు. అప్పు డావిడే "వాళ్ళిద్దరికి ఒకళ్ళంటే ఒకళ్ళ కిష్టం వదినా! మనం పెళ్ళిచేసి మన గౌరవం మనం నిలబెట్టుకోకపోతే ఏ రిజి ష్ట్రాఫీసుకో పోయి చేసుకుంటారు" అంది.

"వాళ్ళిద్దరికీ ఒకళ్లంటే ఒకళ్లకిష్టం ఉండవచ్చుగాని మరీఅంత తెగించే ఇష్టం ఉందనుకోనే!" అంది మా అమ్మ.

"వాళ్ల ఉత్తరాలు రాసుకుంటున్న జోరుచూస్తే మాత్రం నాకలానే అనిపి స్తోంది" అంది ఆవిడ. బాంబు పేలింది. నేను, వరలక్ష్మి ఉత్తరాలు రాసు కుంటున్న విషయం మా అమ్మతో ఒక రెండు రోజుల్లో నేనే చెప్దామనుకుం టున్నాను భ్రమరాంబగారికి, నేను వర లక్ష్మికి ఉత్తరాలు వ్రాస్తున్నట్టు తెలుసు నని నాకానాడే తెలిసింది. అవిడ అవస రానికి తురుపుముక్కకింద వాడ్దామని కాసుక్కూర్చుంది. వరలక్ష్మి వాళ్ళ అమ్మకి చెప్పిన విషయం, నేను మా అమ్మకి చెప్పనందుకు, మా అమ్మ చిన్న బుచ్చుకుంది. కాని బయటికి "శర్మనో మాటు అడిగిచెప్తాను వదినా!" అంది.

నన్ను మా అమ్మ సులభంగానే క్షమించింది. ఎందుకంటే వరలక్ష్మి అణుకువ గల పిల్ల. సర్దుకుపోయే స్వభావంగలపిల్ల. అందుకని ఆమెను కోడలుగా చేసుకోటం మా అమ్మకిష్టమే. కాని మా అమ్మకి భ్రమరాంబగారు బ్లాక్ మెయిల్ చేస్తున్న పద్ధతిలో మాట్లాడటం నచ్చలేదు. ఆవిడేగనుక ఇల్లాంటి విష

యాల్లో మగపిల్లాడి తల్లైవుంటే మీ పిల్ల పరువుపోయి, మరిజన్మలో పెళ్లవదు అంటూ బ్లాక్‌మెయిల్ చేసి మరింత కట్నం సంపాదించగల సమర్థురాలు అని అంది మా అమ్మ. అయితే భ్రమరాంబ గారి కారణంగా వరలక్ష్మిని వదులుకునే తెలివితక్కువది కాదు మా అమ్మ. అందుకని మా పెళ్ళి నిశ్చయం అయింది. అయితే, చిన్నవాళ్లమని మా పెళ్లి రెండేళ్లు వాయిదా వేసారు.

ఎమ్. ఇ. రెండవ సంవత్సరం, రిసెర్చి మొదటి సంవత్సరము వరలక్ష్మికి ఉత్తరాలు వ్రాస్తూ, సెలవలకింటికి వెళ్ళినపుడు వరలక్ష్మితో బీచ్‌లకి సినిమాల్లో తిరుగుతూ, గబా గబా గడిపేసాను. రిసెర్చి రెండోసంవత్సరంలో నాకు వరలక్ష్మితో పెళ్లి అయిపోయింది. అప్పటికి వెంకటేశ్వర్లు ఎమ్. డి పూర్తి చేసాడు. మా పెళ్లిలో చాలామంది భ్రమరాంబగారిని "మీ అబ్బాయికి పెళ్లి చెయ్యరా?" అని అడిగారు. అవిడ "చెయ్యాలి మరి" అంటూ తప్పించుకుంది మా పెళ్లిలో అలిమేలు హడావిడిగా తిరిగింది. ఇంటికోడలు చెయ్యాల్సినంత పనిచేసింది. పెళ్లి పీటలమీద మమ్మల్ని చూసి, కళ్లల్లో కళలు నింపుకుంది. వెంకటేశ్వర్లు అయిందానికి కాని దానికి "అల్లీ! లిల్లీ!" అంటూ అలిమేలుని పిలుస్తూనే ఉన్నాడు. ఆ చనువెప్పుడు ఏర్పడిందో!

ఆ మరుసటేడు శ్రావణమాసంలో శ్రావణమంగళ వారాలనోములు నోచుకునేందుకు, శ్రీ మహాలక్ష్మి వ్రతం చేసుకునేందుకు వరలక్ష్మి మా ఊరు వెళ్లింది. నేను రిసెర్చి చేస్తూ బెంగుళూరులో ఉన్నాను. మా ఊరు నుంచి, వారానికి రెండు, మూడు ఉత్తరాలు వ్రాసేది వరలక్ష్మి. అందులో ఒక ఉత్తరం ఈ కథకి సంబంధించింది. నిజానికది నన్నాశ్చర్యపరచలేదు.

నా బుజ్జి శ్రీవారికి,

సోమవారంనాడు సెనగలు నానపొయ్యటం, మంగళవారం నోమునోచుకుని పేరంటాలకి సెనగలు పంచిపెట్టడం చాలా హడావుడిగా జరుగుతోంది. ముత్తైదువుల కాళ్లకి దండం పెడితే బుజ్జిపాపాయి నెత్తుకోమని అంటున్నారు. చక్కగా మనకోపాపాయుండి, వాడికి మీ పోలిక వస్తే, వాడిలో మీ చిన్నతనం చూసుకుంటూ ... ఎంత బాగుంటుందో!

ఈ మధ్యో పెద్దగొడవ జరిగింది. అమ్మ ఇంట్లోలేని ఓ రోజున అలిమేలు వచ్చింది. అది తిన్నగ అన్నయ్య గదిలోకి వెళ్లింది. నాకోసం వచ్చిందేమోనని దానివెంట వెళ్లాను. అయితే అన్నయ్య గది తలుపు జేరవేసి ఉంది అన్నయ్య కౌగిల్లో, అలిమేలు ఏడుస్తూ ఉండటం నాక్కనిపించింది. వెనక్కి తిరిగాను. "నాకు నెల తప్పింది వెంకటేశ్వర్లూ!" అన్న మాటలు వినిపించి ఆగాను. దాని వల్ల మా అన్నయ్య బాధ్యుడని తెలు

స్తూనే ఉంది. అయితే వాడు, అమ్మ చాటువాడు అంతపని చేసాడా అని ఆశ్చర్యపోయి, రౌడీ అబ్బాయైన మీరే నాతో ఎప్పుడూ అంతదగ్గరకి పెళ్ళికి ముందు రాలేదే! మా అన్నయ్య అంత చొరవ తీసుకున్నాడా! ఇంతకు అలిమేలు అమ్మ ఇంట్లోలేదని అమ్మతో నేను బయటికి వెళ్ళి ఉంటానని ఊహించి వచ్చుండాలి!-

నేను ఉత్తరం చదవటం ఆపాను. నాకూడా వెంకటేశ్వర్లు అంత ధైర్యం చేసాడంటే నమ్మకం కుదరలేదు. బహుశ అలిమేలే ప్రోత్సహించిందేమో! వాడిపనే అయితే డాక్టరుకదా వాడు, ఆమాత్రం శ్రద్ధతీసుకోడా! ఈ కుటుంబ నియంత్రణ వారి ధర్మమా అని హైస్కూలు కుర్రాళ్ళకి కూడా అన్నీ తెలుస్తున్నాయే...మళ్ళీ ఉత్తరం చదవటం మొదలుపెట్టాను...

"నేనేం చెయ్యనుచెప్పు, మా అమ్మ ఒప్పుకోవాలికదా!" అన్నాడన్నయ్య. వాడికి వాడి సుఖమేకాని ఇతర్ల నొప్పి తెలియదు. అల్లా పెంచింది వాడిని అమ్మ. వాడికి కావల్సినవి ఎల్లాగో అల్లా అమిరితే చాలు. తిండి విషయంలోలాగానే ఆఖరికి ఇంద్రియ వాంఛల్లోకూడా మా అన్నయ్యకి స్వార్ధమేతప్ప మరో దృష్టి లేదని తెలుసుకుని బాధపడ్డాను.

...వరలక్ష్మి బాధ ఉద్రేకం నాకర్ధమౌతూనే ఉన్నాయి. కాని వెంకటేశ్వర్లను పెళ్ళిచేసుకుని తీరాలనేపట్టుదలతో శీలాన్ని అలిమేలు పెట్టుబడిగా పెట్టింటే ఏమైనా వెంకటేశ్వర్లంటే నాకు గొప్ప అభిప్రాయం లేనట్టే, అలిమేలు చాలా తెలివైంది, గడుసుని అన్న గొప్ప అభిప్రాయం కూడా ఉంది. వరలక్ష్మి ఇంట్లో ఉందని తెలిసే ఆ పిల్ల వరలక్ష్మికి విన పడేలా మాట్లాడి ఉండవచ్చు. ఎవరూ లేరన్న ధైర్యంతో వెంకటేశ్వర్లు తప్పు ఒప్పుకొంటాడని, అది వరలక్ష్మి వింటుందని, ఆమె ఊహించి ఉండవచ్చు...

అలిమేలు ఏడుస్తూ బయటికి వచ్చింది. నన్నుచూసి కంగారుపడింది. నేను "అంతావిన్నాను అలిమేలూ!" అనగానే నన్ను కౌగలించుకుని భోరుమని ఏడ్చింది. "నువ్వెల్లాంటి పిరికి వెధవని ప్రేమించి, నమ్మి అర్పించుకోడమే నువ్వు చేసిన పొరపాటు...కానీ! నేను మా అమ్మతో మాట్లాడ్తాను" అని ఓదార్చాను. అలిమేలు మొహంలో కనిపించిన ఆనందం చూసాక, ఆపెళ్ళి జరిగి తీరాలన్న నిర్ణయానికి వచ్చాను. "అలిమేలూ! రేపో ఎల్లుండో మంచి రోజు చూసుకుని మీ నాన్నగార్ని వచ్చి అమ్మతో మాట్లాడమను. నేను మిగిలిన విషయాలు చూసుకుంటాను." అని ధైర్యం చెప్పిపంపించాను. అన్నయ్యను తిట్టి లాభంలేదు. అందుకని ఊరుకున్నాను.

నిన్న అలిమేలు వాళ్ళ నాన్నగారు వచ్చారు, వస్తూనే ఆయన లబోదిబోమన్నాడు. "అన్యాయంగా మా వెంకటే



యువ

శ్వర్లమీద నెపం నెడుతున్నారు. పైగా ఆ చెడిపోయిన పిల్లను మా కంటకడదా మని చూస్తున్నారు" అంది అమ్మ నిర్దాక్షిణ్యంగా. ఆ పరిస్థితుల్లో నేనుండిఉంటే ఏమనేదో. అన్నయ్య అవుననడు, కాద నడు. నేను ఊరుకోలేక అన్నయ్యని, అమ్మ ఎదుట వచ్చి ఆయన ఎదుట నిల దీశాను. అన్నయ్య ఒప్పుకున్నాడు. అమ్మ బెదిరింది. "మీ అమ్మాయి మా వాడిని వలలో వేసుకోవాలని ప్రయత్నించి నెగ్గింది. కాని కట్నం పది వేలన్నా ఇవ్వందే ఈ పెళ్లి మాత్రం జరగదు." అని చివరిమాట చెప్పింది. పైగా ఆడపిల్లల్ని కట్టుదిట్టాల్లో పెంచాలని ఉపన్యాసం ఇచ్చింది. ఆయన చేసేదిలేక ఒప్పుకున్నాడు.

ఇంతకు పెళ్లి ఆశ్వయుజ మాసంలో జరుగుతుంది. అంతవరకు ఇక్కడే ఉంటాను. అమ్మ నిన్నటినుంచి లంకకు చెఋపుచేసిన విభీషణుడి ప్రసక్తి మాటి మాటికి తెస్తోంది. అంటే అన్నయ్య రావణాసురుడని ఒప్పుకొంటోందన్న మాటేకదా! అనవసరంగా ఈ గొడవ లన్నీ వ్రాసి మీ మనసు పాడుచేసానేమో! మరోసారి మంచి ఉత్తరం వ్రాస్తాను. ఉంటాను.

మీ

వరలక్ష్మి

నేను బాధపడాల్సిందేముందిందులో! వరలక్ష్మి ఆ యింట్లో తప్పపుట్టి నందుకు సంతోషించాను.

అనుకున్నట్టుగానే పెళ్లి జరిగింది. అలిమేలు తండ్రి ఉన్న కొంప అమ్మి, అలిమేలు పెళ్లిచేసి, పెళ్ళయ్యాక అద్దె ఇంట్లోకి మారిపోయాడు, మిగిలిన పిల్లల తోను, పెళ్లాంతోను. అలిమేలులో చీమ కుట్టినంత బాధ కనపడలేదు. అను కున్నది సాధించిన గర్వం తప్పించి. పెళ్ళి తంతులో, బిందెలోంచి ఉంగరం తీసిన అలిమేలు మొహం, విజయ గర్వంతో వెలిగిపోతే భ్రమరాంబగారి మొహం వెలవెలా పోయింది. మా అమ్మకి, వెంకటేశ్వర్ల పెళ్ళి సందర్భంగా నా మీద కోపం వచ్చింది. పది వేల కట్నంతో తల్లిమాట విని పెళ్లి చేసుకున్న వెంకటేశ్వర్లు బుద్ధిమంతుడుగాను, మా అమ్మ అనుమతి లేకుండా వరలక్ష్మికి ఉత్తరాలు వ్రాసిన నేను రాలుగాయిగాను, మా వీధిలో అత్తయ్యలకి పిన్నులకి, దొడ్డమ్మలకి అనిపించటం ముఖ్యవిశేషం. వెంకటేశ్వర్లు గర్భవతైన అలిమేలుని పెళ్లిచేసుకోటంలో గల నిజాయితీ, ఔదార్యం, భ్రమరాంబగారు, వెంకటేశ్వర్లుకూడా దాచుకోలేదు.

మళ్లీ వేసంగి కాలంలో నేను వర లక్ష్మి మా వూరు వెళ్లాం. భ్రమరాంబ గారు మా ఇంటికివచ్చి తనగోడు వెళ్ళ బోసుకుంది. ఆరునెలల్లో వెంకటేశ్వర్లు చాలా మారిపోయాడని చెప్పింది. అలిమేలతనికి క్లబ్బులకలవాటు చేసిందిట. క్లబ్బులు తాగడం అలవాటు చేసాయిట. పూర్వం, ప్రతినెల జీతం తీసుకువచ్చి

భ్రమరాంబగారి చేతిలో పెట్టే వెంకటేశ్వర్లు ఇప్పుడు అలిమేలు చేతిలో పెడుతున్నాట్ట. ఏమన్నా అంటే "అందరు మొగుళ్లూ వాళ్ళ పెళ్లాల్చేతిలో పెట్టున్నట్టే మీ అబ్బాయి పెట్టున్నారు. అయినా మీ అబ్బాయి మీరు గీచినగీటు దాటరుగదా! పెళ్లికూడ మీరు ఒప్పుకుంటేనే చేసుకున్నారుకదా! ఆయన్నే అడగండి. మధ్య నన్నడుగుతారేం!" అంటుందిట అలిమేలు. వెంకటేశ్వర్లని కదిపితే" ఏమిటమ్మా అసహ్యంగా ఈ దెబ్బలాటలు? వినిపిస్తే వీధిలో అందరు నవ్వుతారు'' అంటాడుట. చివరికి "వాడు, దాని చెప్పుకింద తేలైపోయాడే అమ్మా "అంటూ ఆవిడ వరలక్ష్మి దగ్గర బాధవెళ్ళబోసుకుంది. మా వీధిలో అలిమేలు దేవాంతకురాలనే పేరు సంపాదించుకుంది. మావీధిలోని పిన్నులు దొడ్డమ్మలు అత్తయ్యలు భయంతోను, చెల్లెళ్లు అక్కయ్యలు వదినలు, ఆరాధనతోటి ఆ మాట అంటున్నారు.

అలిమేలువచ్చి మమ్మల్ని వాళ్లింట్లో కూడా ఓ రెండ్రోజులుండమని కోరింది. అల్లాగేవెళ్లాం. వరలక్ష్మికి వాళ్లమ్మమీది జాలికొద్ది "వదినా! మా అన్నయ్యను మరీ నీకొంగుకు ముడేసుకుంటున్నావ్!" అని సిఫ్థారం ఆడింది అలిమేలును. "మీ అన్నయ్య స్వార్థపరుడు పరం! తనకి ఏది వీలుంటే అదిచేస్తాడు. అప్పుడు తల్లిమాట వినడంవల్ల అన్నీ సమకూరేవి కనుక, బాధ్యతంతా ఆవిడ స్వీకరించేది కనుక ఆవిడ మాట వినేవాడు, ఇప్పుడు, ఈ వయస్సుకోరే మరి కొన్ని కోర్కెలు, నేను తీర్చగలను కనుక నామాట వింటున్నట్టు నటించి దాని సాధకబాధకాలు నామీద నెట్టేస్తున్నారు. మెతకమనుషులు ఎవరు బలవంతులో వాళ్ళమాట వింటారు. స్వార్థపరులు ఎవరిమాట వినడం లాభమో వాళ్లమాట వింటారు. నేనాయన్ని నా కొంగుకు ముడేసుకోలేదు. ఆయనే వచ్చి నాకొంగుకు ముడిపడ్డారు. తల్లికైతే అంత డబ్బు ఇవ్వాల్సి వస్తుందని, ఈ గుమస్తా కూతురు ఎంతిచ్చినా ఊరుకుంటుందని నాకు డబ్బు ఇవ్వటం మొదలుపెట్టారు. ఊళ్లోవాళ్ళకి నే చెడ్డదాన్ని అయ్యాను. జల్సాలన్నీ ఆయనవి. అన్నీ భరించి నేను ఈ డబ్బు, ఇల్లాంటివాటి కోసమే తీసుకుంటాను" అంటూ లోపలికి వెళ్లి చీర, రవికలగుడ్డ పసుపుకుంకుమ తెచ్చి వరలక్ష్మిచేతిలో పెట్టింది. వరలక్ష్మి కళ్లల్లో పశ్చాత్తాపం చూసి తృప్తిగా నిట్టూర్చింది.

మేము ఇంకా అక్కడ ఉండగానే అలిమేలుకి పురుడువచ్చింది. కొడుకు పుట్టాడు. వాడికి వరలక్ష్మి బంగారు, మురుగులు చేయించింది. "వీడిని మాత్రం మీ అన్నయ్యని మీ అమ్మగారు పెంచినట్టు పెంచను" అంది అలిమేలు మాతో.

అంటే 'పెళ్ళయ్యాక కూడా తల్లి కొంగు వదలని వాడిగా పెంచుతుందా అలిమేలు?' అన్న అనుమానం కలిగింది నాకు.

——